లాభాల బాటలో చీనీ రైతులు

- సూట్ లేకుండా టన్ను రూ.23 వేలు పలుకుతున్న చీనీ ధరలు
- అనంతపురం మార్కెట్ కంటే పులివెందుల మార్కెట్ చీనీ ధరలు ఎక్కువ
- మార్కెట్‌యార్డుకు చీనీకాయలు తరలిస్తున్న రైతన్నలు



పులివెందుల మార్కెట్‌యార్డులో వేలంపాటలో పాల్గొన్న రైతులు(ఫైల్)

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కళ్లలో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ముద్దనూరు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌లో సుమారు లక్షల రూపాయల వ్యయంతో షెడ్లు ఏర్పాటు చేశారు. అలాగే చీనీకాయలకు సూట్ లేకుండా చేయాలనే దృఢసంకల్పంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సలహాలతో పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు రైతులకు ఎంపీడీఓ కార్యాలయం, రైతు భరోసా కేంద్రాలలో అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు రైతులు, చీనీ వ్యాపారులతో కలిసి చీనీకాయలకు సూట్ లేకుండా కొనుగోలు చేసేందుకు మార్కెట్‌యార్డులో అనుకూలంగా గదులను నిర్మించారు. నియోజకవర్గంలోని రైతన్నలు అధిక సంఖ్యలో చీనీకాయలను తీసుకువచ్చి మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. రైతులు తాము పండించిన చీనీకాయలను విక్రయించేందుకు ప్రతీరోజు సుమారు 30 నుంచి 40 టన్నుల వరకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్‌లో టన్ను చీనీధరలు రూ.23 వేలు బాగానే ఉండటంతో రైతన్నలందరు మార్కెట్‌లోనే తాము పండించిన చీనీకాయలను తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారు. బయట అనంతపురం జిల్లా మార్కెట్‌కంటే పులివెందుల మార్కెట్‌లో చీనీ టన్ను ధర నాణ్యమైన కాయలైతే రూ.23వేలు పైచిలుకే ఉంటోంది. కాయల నాణ్యతను బట్టి రైతన్నలు చీనీ విక్రయాలు చేస్తున్నారు. అలాగే రైతులు కూడా తాము పండించిన పంటలను గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌కు తరలిస్తున్నారు. అనంతపురం మార్కెట్‌లో అయితే 10 టన్నులకు రెండున్నర టన్ను సూట్ తీసుకుంటున్నారని, పులివెందుల మార్కెట్‌లో అయితే ఎటువంటి సూట్ తీసుకోవడం లేదని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రవాణా చార్జీలు కూడా తగ్గుతుండడం వల్ల పులివెందుల మార్కెట్‌కే చీనీకాయలను తరలించి విక్రయాలు చేస్తున్నారు.

పులివెందుల మార్కెట్‌లో సూట్ ఉండదు



రైతులు పండించిన పంటలను ఇతర మార్కెట్‌లకు తరలిస్తే 10 టన్నులకు రెండున్నర టన్ను సూట్ వేస్తారు. కానీ పులివెందుల మార్కెట్‌కు తరలిస్తే ఎటువంటి సూట్ ఉండదు. అనంతపురం జిల్లా మార్కెట్‌లో కంటే పులివెందుల మార్కెట్‌లో చీనీ ధరలు బాగానే ఉన్నాయి. దీంతో రైతులకు లాభాలు కూడా వస్తున్నాయి.
– భాస్కర్‌రెడ్డి, రైతు

రవాణా చార్జీలు తగ్గుతాయి



రైతులు పండించిన పంటలను అనంతపురం, తిరుపతి, బెంగుళూరు, హైదరాబాదు మార్కెట్‌లకు తరలించాలంటే రవాణా చార్జీలు ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. పులివెందుల మార్కెట్‌లో చీనీకాయలను అధికారులే కొనుగోలు చేయడం వల్ల రవాణా చార్జీలు చాలా వరకు తగ్గుతాయి. చీనీకాయల కొనుగోలు కేంద్రాలను పులివెందులలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము.
– నారాయణరెడ్డి, రైతు

రైతులకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తుంది



రైతులు తాము పండించిన పంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిట్టుబాటు ధర కల్పించే విధంగా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రైతులు పండించిన చీనీకాయలను ఇతర ప్రాంతాలకు తరలించేవారు. పులివెందులలో వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అనుగుణంగా చీనీకాయలు నిల్వ ఉంచుకుని విక్రయాలు జరిపేందుకు జంబో షెడ్లుతో పాటు గదులను ఏర్పాటు చేశారు. రైతులు కూడా పులివెందుల చీనీ మార్కెట్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చి చీనీకాయలను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.
– చిన్నప్ప, మార్కెట్‌యార్డు ఛైర్మెన్

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



నాగలగట్టుపల్లెలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని సురభి గ్రామం నాగులగుట్టపల్లెలోని జగనన్న లే అవుట్‌తో పాటు అందులో నూతనంగా నిర్మించిన గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు తమకు గతంలో ఇల్లురాకపోయినా వచ్చినట్లు చూపిస్తోందని, ఫలితంగా తమకు ఇప్పుడు జగనన్న పక్కా గృహం అందలేదని ఆయనకు వివరించారు. స్పందించిన ఆయన ఇలాంటి సమస్యలపై ఇదివరకే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో తాను చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనిపై త్వరలోనే ఒక పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం కార్యకర్తలు కొండారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వేదమూర్తి, సర్పంచ్ రమణమ్మ, బీసీ నాయకుడు శ్రీనివాసులు, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు చర్మవ్యాధుల వైద్యనిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురం సమీపంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రి) నందు శుక్రవారం చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ ఎస్.సౌజన్య రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, సలిపిరి, అలర్జీ, ఆనెలు, పేనుకొరుకుట, జుట్టురాలుట, గోర్లుపుచ్చుట, ముఖంమీద మచ్చలు, కుష్టు, తదితర చర్మవ్యాధులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. అలాగే డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చెవిలో చీముకారుట, చెవినొప్పి, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చబడటం, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వరపేటికలో లోపాలకు చికిత్స, తలనొప్పి, తలతిరుగుట, తదితర సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మొబైల్ ఆధార్ కేంద్రం తనిఖీ



మొబైల్ ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో జుబేద

వల్లూరు : మండల పరిధిలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో జుబేద గురువారం తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఆధార్ అప్డేట్ చేయించుకున్న వారి సంఖ్య గురించి ఆరా తీశారు. ఆమె ఆధార్ కేంద్రంలో వున్న ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్ చేయించుకోవాలనే ధ్యేయంతో ప్రభుత్వం మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. శుక్రవారం మండలంలోని తప్పెట్ల గ్రామ సచివాలయంలో, శనివారం వల్లూరు గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

క్లుప్తంగా

రేపు మండల సమావేశం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళాశిశు సంక్షేమ, అంగన్‌వాడీ పాఠశాలల సమస్యలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి పలు సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తికి సేవలు



మతి స్థిమితంలేని వ్యక్తికి క్షురకర్మ చేస్తున్న విజయ్‌బాబు

కమలాపురం : పట్టణంలో మతి స్థిమితంలేని వ్యక్తికి అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.విజయ్‌బాబు సేవలు చేశారు. మాసిన బట్టలు, పెరిగిన జుట్టుతో తిరుగుతున్న మతి స్థిమితం లేని వ్యక్తిని గురువారం విజయ్‌బాబు స్వయానా కటింగ్ చేసి స్నానం చేసి, బట్టలు మార్చారు. ఊరు, పేరు చెప్పలేని స్థితిలో ఉన్న ఆ వ్యక్తికి సేవలు చేసినందుకు పట్టణ ప్రజలు విజయ్ బాబును అభినందించారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయండి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. మినీసెక్రటేరియట్ , సిటీ సెంట్రమ్, ఇంటర్నల్ రూట్స్, రింగురోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. పనులు వేగవంతం చేయకుండా ఆలస్యం చేస్తే కాంట్రాక్టర్లు బాధ్యత తీసుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం శ్రీకృష్ణ ఆలయం, శిల్పారామం, గురుకుల పాఠశాల, అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలలను సందర్శించారు. హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల, అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బి.ఎస్. నాయుడు నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ సిద్ధారెడ్డి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ మురళీకృష్ణ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

వేంపల్లె : పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదంపై స్థానిక బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రధానిమోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ దేశంలో మహిళలకు సాధికారికత కల్పించే దిశగా, విధాన నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం పెంచేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. గత మూడు దశాబ్దాలుగా మహిళా బిల్లు ఆమోదానికి నోచుకోలేదని నేడు ప్రధాని సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం వల్లనే ఇది సాధ్యమైందని తెలిపారు. ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, మహిళల కోసం బేటి పడావో బేటి బచావో, సుకన్య సమృద్ధియోజన, ఉజ్వత యోజన, స్వచ్ఛభారత్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇలా అనేక సంక్షేమ పథకాలు తెచ్చి మహిళా పక్షపాతిగా పేరుతెచ్చుకున్న మోదీ పాలిచ్చే తల్లులకు పరిపాలించడం కూడా తెలుసని భావించి మహిళా బిల్లు తెచ్చారని, ఇందుకు ప్రతి ఒక్క మహిళ ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలపాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుస్మా, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం కడప నగరంలోని హోచిమెన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఇటీవల జరిగిన కడప జిల్లా 16వ మహాసభలలో జిల్లా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా వడ్డమాను వీరశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.సుబ్రహ్మణ్యం, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా పగడపూల మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్ సుబ్రహ్మణ్యం, బాష, మనోహర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా షావలి, బ్రహ్మంలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు



ప్రజలకు పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా ఉంటూ వారికి సంక్షేమ ఫలాలు అందజేస్తోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఇస్లాంపురం ప్రాంతాల్లో నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, పథకాలను వివరించారు. ఎవరికైనా పథకాలు అందకపోతే తెలపాలన్నారు. ఇస్లాంపురంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిశోర్, కోడి రమణ, ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓతూరు రసూల్, యార్వ వెంకటసుబ్బయ్య, సోఫాల వీరా, సిద్దయ్య, మస్తాన్, బండి మల్లికార్జునరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుజాడ అప్పారావు జయంతి



వేంపల్లెలో గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ, వ్యాయామశాఖ సంయుక్తంగా గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యోగాంజనేయులు మాట్లాడుతూ నేడు ఏ సమస్యలైతే సమాజాభివృద్ధికి, రాజకీయ అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకాలుగా ఉన్నాయో వాటినే నాడు పసికట్టి వాటన్నిటికి పరిష్కారం చూపిన గొప్ప మేధావి గురజాడ అప్పారావు అని కొనియాడారు. కళాశాల తెలుగు శాఖాధిపతి నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ గ్రామీణభాషను, వ్యవహారిక భాషను కొన్ని దశాబ్దాలు కొనసాగడానికి గురజాడ సాహిత్యం ఎంతో ఉపయోగపడిందన్నారు. మహిళలకు ఏమాత్రం ప్రాముఖ్యత లేని రోజుల్లో కన్యాశుల్కంను రచించి మహిళాభ్యుదయానికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, న్యాక్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సతీష్, రెడ్‌రిబ్బన్‌క్లబ్ కోఆర్డినేటర్ సుదాకర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురిజాడ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ గీతాలాపన కరపత్రములను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యాక్షులు సుజన్‌కుమార్, హెచ్ఎం రామాజంనేయరెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా పతంగే రామన్నరావు పాఠశాలలో డీవైఎఫ్ఐ నాయకుడు జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురజాడ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ బోర్డు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : మండలంలోని అన్ని ఎరువుల, పురుగు మందుల దుకాణాలలో స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం పట్టణంతో పాటు మండలంలోని అన్ని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే ఎరువులు ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. లేని పక్షంలో షాపులు సీజ్ చేస్తామన్నారు. ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి ఆయన వెంట ఉన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని ఎరువుల దుకాణాలను కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీ నరసింహారెడ్డి గురువారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలను పరిశీలించారు. ఈ పాస్ మిషన్‌లో నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలకు వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మరాదని, వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి దుకాణదారుడు షాపులో స్టాక్ బోర్డు, ఎరువుల ధరల వివరాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా సచివాలయాల కోఆర్డినేటర్ కల్లూరి నాగేంద్రరెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి వివరించాలని వైఎస్సార్ జిల్లా సచివాలయాల కోఆర్డినేటర్ కల్లూరి నాగేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహసారధులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఇంటింటికి తీసుకెళ్లే బాధ్యత గృహసారధులదన్నారు. సచివాలయ కన్వీనర్లకు, గృహసారధులకు మన ప్రభుత్వం ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం



ఎర్రగుంట్ల : వినాయకుడిని నిమజ్జనంకు తరలిస్తున్న దృశ్యం



కమలాపురం : పుట్లంపల్లెలో వేలం పాటలో లడ్డు దక్కించుకున్న శివారెడ్డి



వల్లూరు : పెద్దపుత్తలో గణేషుని గ్రామోత్సవం



ఎం.కొత్తపేటలో రూ.1.93 లక్షలకు లడ్డును దక్కించుకున్న పెంచలయ్య



లింగాల : రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తున్న యువకులు



బయనపల్లెలో స్వామి లడ్డూ దక్కించుకున్న విష్ణుమూర్తిరెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని మహాత్మనగర్ కాలనీ, రాణీవనం, శాంతినగర్ వీధులలో కొలువుదీరిన గణనాథుడికి గురువారం విశేష పూజలు అందించి నిమజ్జనంకు తరలించారు. శాంతినగర్ కాలనీలోని రెండు వినాయక విగ్రహాలకు భారీగా ఊరేగింపు నిర్వహించారు. రాణీవనంలో వినాయక లడ్డును రూ.32 వేలకు పాటలో రవిశంకర్ దక్కించుకున్నారు.

జమ్మలమడుగు..

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో గణనాథునికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గురువారం విగ్రహం కొలువై 4 రోజులు కావడంతో భక్తులు విశేషముగా తరలివచ్చ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని దిగువలింగాల, ఎగువలింగాలలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. దిగువ లింగాలలో రామాలయం, బీసీ కాలనీ, సంఘంమిద్దె వద్ద, ఎగువలింగాలలో రామాలయం వద్ద నెలకొల్పిన గణనాథుని విగ్రహాలను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువకులు, పిల్లలు పెద్ద సంఖ్యలో వినాయకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. సమీపంలోని చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలో వినాయకుని నిమజ్జన వేడుకలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఈనెల 18వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను కమలాపురం శివారులోని కుందూ నదిలో నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో స్వామి వారిని వైభవంగా ఊరేగించారు. బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. పుట్లంపల్లెలో వినాయకుని చేతిలో ఉంచిన లడ్డును వేలం వేయగా పట్టణానికి చెందిన శివారెడ్డి రూ.20 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం లడ్డును భక్తులకు పంచి పెట్టాడు. పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. నిమజ్జనం జరిగే కుందూ నది వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చిన్నపెద్దయ్య భద్రత కట్టుదిట్టం చేశారు.

లడ్డూ వేలం పాట

కమలాపురం మండలం బయనపల్లెలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూ వేలం వేశారు. విష్ణుమూర్తి రెడ్డి అనే భక్తుడు రూ. 91 వేలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నాడు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని రామనపల్లిలో గణనాథుడు నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. అలాగే చెన్నూరు టౌన్‌లోని బెస్త కాలనీ, కేఓఆర్ కాలనీలలో గణనాథుడు నిమజ్జనానికి తరలి వెళ్లాడు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామనపల్లెలో లడ్డూ వేలం పాటలు పోటీగా సాగాయి. పెన్నానదికి వెళ్లి వినాయకుల నిమజ్జనం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో గణేషుని నిమజ్జనం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్త, బీచువారిపల్లె, బాలుగారిపల్లె తదితర గ్రామాల్లో 5 రోజులుగా పూజలు నిర్వహించి గురువారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. లడ్డూ ప్రసాదాల వేలం పాట నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేశారు. అనంతరం ట్రాక్టర్లలో వుంచి డప్పులు, బ్యాండు మేళ వాయిద్యాల నడుమ, బాణా సంచా పేలుస్తూ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. యువకులు చేసిన వివిధ రకాల నృత్యాలు, కర్రసాములు, సాహస విన్యాసాలు అలరించాయి. అనంతరం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద, ఆలంఖాన్‌పల్లె వద్ద గల కేసీ కెనాల్‌లో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తసంగటిపల్లె, ఎం.కొత్తపేట, గుర్రాలచింతపల్లె తదితర గ్రామాల్లో గురువారం ఘనంగా గణనాథుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. మూడు రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేసి గురువారం సాయంత్రం వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లలో సమీపంలో ఉన్న కాల్వలు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎం.కొత్తపేట గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో బి.పెంచలయ్య రూ.1.93 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం

ఎర్రగుంట్ల : బాల్య వివాహాలు నిర్వహించకూడదని పురుషులకు 21 సంవత్సరాలు, స్త్రీలకు 18 సంవత్సరాలు నిండాలని మున్సిపల్ కమిషనర్ పగిడాల జగన్నాథ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపాలు, మసీదులు, చర్చిలలో వివాహాలు నిర్వహించే వారు నియమాలు పాటించాలని సూచించారు. వధువరుల ఆధార్ కార్డు, వయస్సు నిర్ధారణ పత్రాలు రిజిస్టర్ చేసుకుని వివాహాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు నిర్వహించే వారికి చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మైనర్ వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 టోల్ ఫ్రి నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం పూర్తి అయినటువంటి విద్యార్థులు గతనెల 26వ తేదీన కడప ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన మహాజాబ్ మేళాలో 37 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్ ఆఫీసర్ టీవీ అరవింద్ మాట్లాడుతూ ఈ మహాజాబ్ మేళాలో యంగ్ ఇండియా కంపెనీకి 11 మంది, టీసీఎల్ కంపెనీకి 9 మంది, ఆరోరా కంపెనీకి 11 మంది, ఫోన్‌పే కంపెనీకి ఒకరు, అరబిందో కంపెనీకి ముగ్గురు, అమెజాన్ కంపెనీకి ఒకరు, టాటా మోటార్స్ కంపెనీకి ఒకరు, నవత కంపెనీకి ఒకరు ఇంటర్వ్యూలో ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందినటువంటి విద్యార్థినీ విద్యార్థులను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేసి అభినందించారు.